క్లుప్తంగా

ఇఫ్తార్ విందులో మాజీ మంత్రి వెలంపల్లి



పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): స్థానిక 34వ డివిజన్ కేదారేశ్వరపేటలో పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు షేక్ మాబు ఆధ్వర్యంలో సోమవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వెలంపల్లి శ్రీనివాస్ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం వెలంపల్లి మాట్లాడుతూ రంజాన్ మాసంలో నిర్వహించే ఇఫ్తార్ విందులు మత సామరస్యాన్ని తెలియజేస్తాయని పేర్కొన్నారు. అనంతరం ఇఫ్తార్ విందును వడ్డించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్, రాష్ట్ర ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండి పుణ్యశీల, నాయకులు రాజీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు ఇఫ్తార్‌ను బహిష్కరించండి

భవానీపురం(విజయవాడపశ్చిమ): ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొనే ఇఫ్తార్ విందును ముస్లిం సమాజం బహిష్కరించాలని వైఎస్సార్ సీపీ మైనార్టీ నాయకుడు, జిల్లా వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ షేక్ గౌస్ మొహిద్దీన్ సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. వక్ఫ్‌బోర్డ్‌ను నాశనం చేయాలనే ఆలోచనతో కేంద్రం ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకించలేని చంద్రబాబు తీరు గర్హనీయమని పేర్కొన్నారు. వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకించలేదంటే చంద్రబాబు దానికి అనుకూలమని అర్థం అవుతోందన్నారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం ముస్లిం మైనార్టీల సంక్షేమ పథకాలను నీరుకారుస్తూ మైనార్టీలకు వెన్నుపోటు పొడుస్తోందని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తే నేటి వరకు చంద్రబాబు ఎందుకు స్పందించలేదని మండిపడ్డారు. ఒక వైపు ముస్లింల పట్ల మొసలి కన్నీరు కారుస్తూ మరోవైపు కూటమి ప్రభుత్వం ఇచ్చే ఇఫ్తార్ విందు ముస్లిం సమాజానికి అక్కర్లేదని స్పష్టం చేశారు. ఇప్పటికైనా వక్ఫ్ సవరణ బిల్లుపై చంద్రబాబు ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని గౌస్ మొహిద్దీన్ డిమాండ్ చేశారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం

పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థ సర్కిల్–3 పరిధిలోని ఎస్ఎస్ఎం స్కూల్ రోడ్డులో ఉన్న జీడీఈటీ స్కూల్ వద్ద పంపింగ్ లైన్ లీకవడంతో స్థానికంగా పలు ప్రాంతాల్లో తాత్కాలికంగా తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంపింగ్ లైన్ మరమ్మతులు చేస్తున్నందున ఈ నెల 26వ తేదీ సాయంత్రం నుంచి గురువారం ఉదయం వరకు తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ లైన్ నుంచి తాగునీటి సరఫరా జరిగే 9, 13, 14 డివిజన్ల పరిధిలోని పటమట, రాఘవనగర్, పటమట లంక చేపల మార్కెట్ ప్రాంతం, కృష్ణవేణి స్కూల్ రోడ్డు, ఎస్ఎస్ఎం స్కూల్ ఏరియా, సర్కిల్-3 ఆఫీస్ కార్యాలయ ప్రాంతం, అంబేడ్కర్ నగర్, నల్లూరి సత్యనారాయణ నగర్, శాంతినగర్, దర్శిపేట, శివాలయం కొండప్రాంతం, లంబాడీపేట, తోటవారి వీధి, లక్ష్మి హాస్పిటల్ రోడ్డు, యలమంచిలి రామాలయం వీధి, టాగూర్ టైప్ ఇనిస్టిట్యూట్ రోడ్డు ప్రాంతాల్లో తాగునీటి సరఫరా జరగదని వివరించారు. ఆయా ప్రాంతవాసులు ముందుగానే నీటిని నిల్వ చేసుకోవాలని సూచించారు.

పన్ను బకాయిలు ఉన్న వారిపై చర్యలు

పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థకు బకాయిలున్న అసెస్‌మెంట్లపై వీఎంసీ రెవిన్యూ విభాగం సోమవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించింది. వాణిజ్య కార్యకలాపాలు నిర్వహించే అసెస్‌మెంట్ నుంచి ఆస్తిపన్ను వసూలు చేసే క్రమంలో సత్యనారాయణపురం, గవర్నర్‌పేట, సీతన్నపేట ప్రాంతాల్లో దీర్ఘకాలికంగా పేరుకుపోయిన బకాయిలున్న షాపులకు వీఎంసీ రెవిన్యూ విభాగం సిబ్బంది తాళం వేశారు. నగరంలోని ప్రజలందరూ మార్చి 31, 2025 లోగా వివిధ రకాలైన ఆస్తి, ఖాళీ స్థలాల, డ్రైనేజ్, మంచినీటి పనులను చెల్లించాలని వీఎంసీ అధికారులు కోరారు.

ఆహ్లాదానికి కేరాఫ్ కేఎల్‌రావు పార్కు

- గత వైఎస్సార్ సీపీ హయాంలో నిధుల కేటాయింపు
- మారుతున్న పార్కు రూపురేఖలు
- క్రీడాకారుల కోసం ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్‌పూల్

నాలుగు దశాబ్దాల కిందట అదో చెత్త డంపింగ్ యార్డు.. నగరంలోని చెత్త, వ్యర్థాలు తరలించే ప్రాంతం.. కేఎల్‌రావునగర్ బ్యాంక్ కాలనీకి రావాలంటేనే భయపడే పరిస్థితి.. ముక్కు పుటాలు అదిరిపోయే దుర్వాసన. కానీ నేడు ఈ ప్రాంతం సందర్శకులకు మంచి ఆహ్లాదాన్ని పంచే చక్కటి కేఎల్‌రావు పార్కుగా తీర్చిదిద్దారు. అంతేనా.. క్రీడాకారుల స్వర్గధామంగా మారిన కేఎల్‌రావు ఇండోర్ స్టేడియం, కేఎల్‌రావు స్విమ్మింగ్ పూల్‌ల సమూహం.



కేఎల్‌రావు పార్కు ఎంట్రన్స్ గేట్

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): గడిచిన ఐదేళ్లలో నగరంలోని కేఎల్‌రావు పార్కు రూపురేఖలే మారిపోయాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కేఎల్‌రావు పార్కు అభివృద్ధికి నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి పర్యవేక్షణలో రూ. కోటి మేర నిధులు కేటాయించి పనులు చేపట్టి పూర్తిచేశారు. అంతేకాకుండా షటిల్ క్రీడాకారుల కోసం ఇండోర్ స్టేడియం, పార్కు ఆవరణలో ఉన్న స్విమ్మింగ్ పూల్‌ను మరో రూ. 80 లక్షలతో అభివృద్ధి చేశారు. పార్కులో వాకింగ్ చేసే వారి కోసం వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేయడంతో పాటు పార్కును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అలాగే చిన్నారుల కోసం ఇటీవల 12కి పైగా ఆట వస్తువులను ఏర్పాటు చేస్తున్నారు. మరో వారం రోజుల్లో పనులు పూర్తవుతాయి. వేసవి సెలవుల నాటికి పార్కు సందర్శకుల కోసం సిద్ధమవుతుందని కార్పొరేషన్ అధికారులు పేర్కొంటున్నారు.

ఆహ్లాదం కలిగించేలా వాటర్ ఫౌంటేన్

పార్కుకు విచ్చేసే సందర్శకులకు ఆహ్లాదం కోసం ప్రధాన గేటుకు ఎదురుగా వాటర్ ఫౌంటేన్ ఏర్పాటు చేశారు. ప్రతి రోజు సాయంత్రం సమయంలో ఈ వాటర్ ఫౌంటేన్‌ను ఆన్ చేస్తున్నారు. పార్కుకు వచ్చే సందర్శకులకు చక్కటి సదుపాయాలను కల్పిస్తున్నారు. పార్కులో మినరల్ వాటర్ ప్లాంట్‌ను సైతం ఏర్పాటు చేశారు. ఉదయం, సాయంత్రం వేళ పార్కుకు వచ్చే సందర్శకులకు ఈ ప్లాంట్ ఎంతో ఉపయోగకరంగా మారింది. పార్కును అభివృద్ధి చేయడంతో పాటు సందర్శకుల కోసం పలు ఏర్పాట్లు చేయడంతో ఆదాయం కూడా గణనీయంగా పెరిగింది. కేఎల్‌రావు పార్కుకు పూర్వ వైభవం తిరిగి వస్తోందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆ ఒక్కటీ తక్కువైంది..!

కేఎల్‌రావు పార్కు అంటేనే బోటింగ్.. నగరంలో మూడు కెనాల్స్ ఉన్నా, పదుల సంఖ్యలో పార్కులు ఉన్నా ఏ పార్కుకు లేని బోటింగ్ సదుపాయం ఈ పార్కు సొంతం. నగరంలోని పలు ప్రాంతాల నుంచి ప్రజలు బోటింగ్ కోసం కేఎల్‌రావు పార్కుకు విచ్చేసేవారు. సందర్శకుల కోసం ఐదు బోట్ల వరకు అందుబాటులో ఉండేవి. అయితే బోట్లు మరమ్మతులకు గురి కావడం, అదే సమయంలో పార్కు అభివృద్ధికి బీజం పడటంతో బోటింగ్‌ను మూసివేశారు. అయితే పార్కులో అభివృద్ధి పనులు పూర్తయినా.. కార్పొరేషన్ అధికారులు బోటింగ్‌పై దృష్టి పెట్టడం లేదు. దీంతో ప్రతిరోజు కార్పొరేషన్‌కు వచ్చే ఆదాయం నష్టపోతుంది. పార్కు పూర్తి స్థాయిలో సందర్శకులకు అందుబాటులోకి రావాలంటే బోటింగ్ సదుపాయాన్ని తిరిగి ప్రారంభించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



చిన్నారుల కోసం ఏర్పాటు చేస్తున్న ఆట పరికరాలు



పార్కులోని బోటింగ్ కెనాల్

ఇండోర్ స్టేడియం



కేఎల్‌రావు స్విమ్మింగ్ పూల్‌లో శిక్షణ పొందుతున్న చిన్నారులు

కేఎల్‌రావు పార్కుకు వచ్చే షటిల్ క్రీడాకారుల కోసం కార్పొరేషన్ రూ. కోట్ల వ్యయంతో ఇండోర్ స్టేడియం నిర్మించింది. గత ఏడాది బుడమేరు వరద ముంపు సమయంలో ఇండోర్ స్టేడియం పూర్తిగా దెబ్బతినగా, ఇటీవల తిరిగి మరమ్మతులు చేశారు. మరోవైపు కేఎల్‌రావు స్విమ్మింగ్ పూల్‌లో ఎంతో మంది చిన్నారులు స్విమ్మింగ్‌లో మెలుకువలు నేర్చుకోవడంతో పాటు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణిస్తున్నారు. చిన్నారులతో పాటు మహిళలు కూడా ఇక్కడ స్విమ్మింగ్ నేర్చుకుని పోటీల్లో రాణిస్తున్నారు.

30న ఉగాది వేడుకలు



ఉగాది వేడుకల ఆహ్వాన పత్రికను ఆవిష్కరించిన సభ్యులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 30వ తేదీన భవానీపురం హౌసింగ్‌బోర్డ్ కాలనీలోని ఆల్ ఎంప్లాయిస్ పెన్షనర్స్ అసోసియేషన్ హాల్‌లో ఉగాది వేడుకలను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ఇన్‌చార్జ్ అధ్యక్షుడు ఏమినేని వెంకటేశ్వర్లు తెలిపారు. అసోసియేషన్ హాల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. 30న ఉదయం 9.30 గంటలకు చిట్టాల సదాశివ శర్మ పంచాంగ పఠనం, అనంతరం సూరిశెట్టి రామయ్య–మహాలక్ష్మి మెమోరియల్ ఆధ్వర్యంలో క్యారమ్స్, చెస్ పోటీల విజేతలకు బహుమతి ప్రదానం జరుగుతుందని పేర్కొన్నారు. అలాగే విశ్రాంత సంస్కృత అధ్యాపకులు పమిడిపాటి పట్టాభి రామారావు కవితలు వినిపిస్తారని తెలిపారు. అనంతరం ఉగాది వేడుకల ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. సమావేశంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు దేవరకొండ శేషగిరిరావు, ఉపాధ్యక్షుడు పీ పట్టాభి రామారావు, సెక్రటరీ సందక కృష్ణ, కోశాధికారి యెనిగళ్ల సుబ్బారావు, జాయింట్ సెక్రటరీ షేక్ ఇనయతుల్లా, ఈసీ మెంబర్ మండలి రత్నాకరరావు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యం

పటమట(విజయవాడతూర్పు): ప్రజా సమస్యలను వేగంగా, సమర్థంగా పరిష్కరించడమే నగరపాలక సంస్థ ప్రధాన లక్ష్యమని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. ఫిర్యాదులపై స్పందించడంతో పాటు, వాటికి శాశ్వత పరిష్కారంపై అధికారులకు దృష్టి సారించాలని అన్నారు. సోమవారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదులు–పరిష్కార కార్యక్రమంలో ఆయన నగర వాసుల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పౌరుల అవసరాలు, నగరాభివృద్ధి ప్రణాళికలు, మౌలిక సదుపాయాల మెరుగుదల తదితర అంశాలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడానికి నగరపాలక సంస్థ కృషి చేస్తోందని తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో మొత్తం 24 ఫిర్యాదులు స్వీకరించారు.



నగరవాసుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

కార్యక్రమంలో చీఫ్ ఇంజినీర్ ఆర్ శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్వీ ప్రసాద్, సూపరింటెండెంటింగ్ ఇంజినీర్లు పీ సత్యనారాయణ, పీ సత్యకుమారి, డెప్యూటీ కమిషనర్ (రెవిన్యూ) సృజన, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.









ఎండ.. జాగ్రత్తలే అండ

నగరంలో రోజు రోజుకూ భానుడు ప్రతాపం చూపుతున్నాడు. ఉష్ణోగ్రతలు అధికమవుతుండటంతో అత్యవసర పనులపై బయటకు వచ్చే వారు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. గొడుగులు, స్కార్ఫ్‌లతో ఎండ తీవ్రత నుంచి రక్షణ పొందుతున్నారు. కొబ్బరి నీళ్లు, ఇతర పానీయాలు తీసుకుంటూ ఉపశమిస్తున్నారు. ఏసీ బస్‌షెల్టర్లలో ప్రయాణికులు సేదతీరుతున్నారు. చలివేంద్రాల వద్ద దాహార్తి తీసుకుంటున్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

ఎస్టీ వర్గీకరణ ప్రక్రియ చేపట్టాలి

ఏపీ గిరిజన సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు లక్ష్మణరావు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఎస్సీ వర్గీకరణ తరహాలోనే ఎస్టీ వర్గీకరణ ప్రక్రియ చేపట్టాలని, అప్పుడే ట్రైబల్స్‌కు న్యాయం జరుగుతుందని ఏపీ గిరిజన సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గాలేటి లక్ష్మణరావు పేర్కొన్నారు. విద్యాధరపురం నాలుగు స్తంభాల సెంటర్‌లోని సంఘ కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజన సామాజికవర్గం ప్రజల అభివృద్ధికి అన్ని ప్రభుత్వాలు బాగానే కృషి చేశాయని తెలిపారు. అయితే విద్య లేకపోతే ఎవరూ అభివృద్ధి చెందరనడానికి ట్రైబల్స్ నిదర్శనమని, వారి పిల్లలకు విద్య నేర్పించే బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలని కోరారు. గతంలో గిరిజనుల ఉత్పత్తులను రైతులు కొనుగోలు చేసేవారని, గత పదేళ్లుగా అటవీ శాఖ వాటి విక్రయాలను నిలుపుదల చేసిన కారణంగా గిరిజనులు జీవనోపాధి కోల్పోయి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. మైదాన ప్రాంతంలో నివసించే ఎరుకలు, యానాదులు, చెంచులు, లంబాడీలు సేకరించిన వస్తువులను అమ్ముకునే విధానాన్ని పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని కోరారు. సుప్రీం కోర్టు తీర్పుకు అనుగుణంగా ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేసి మైదానం ప్రాంతంలోని ఎరుకల, యానాదుల, చెంచుల, లంబాడీల జీవన స్థితిగతులను అధ్యయనం చేయాలని అన్నారు. అన్ని విధాల వెనుకబడిన వారి అభివృద్ధికి ఒక ప్రణాళిక తయారు చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.



మాట్లాడుతున్న లక్ష్మణరావు

కార్పొరేట్ సంస్థలు సామాజిక బాధ్యత నెరవేర్చాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): కార్పొరేట్ సంస్థలు సామాజిక బాధ్యత నెరవేర్చాలని రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. పేర్కొన్నారు. మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో విద్యార్థినులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పేదరికంతో పిల్లల చదువులు ఆగిపోకూడదన్నారు. కార్పొరేట్ సంస్థలు కేవలం వ్యాపార దృక్పథంతో మాత్రమే కాకుండా మలబార్ చారిటబుల్ ట్రస్ట్ అందిస్తున్న సామాజిక సేవలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజా సేవలో భాగస్వాములు కావాలని కోరారు. మలబార్ గ్రూప్ రెస్ట్ ఆఫ్ ఇండియా రిటైల్ హెడ్ సిరాజ్ పీకే మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఈ ఏడాది 21 వేల మంది బాలికల విద్యకు మద్దతుగా రూ.716 కోట్లు కేటాయించామని తెలిపారు. ఏపీలోని 142 కళాశాలల్లో 1,928 మంది విద్యార్థినులకు రూ.1.67 కోట్లు స్కాలర్‌షిప్ కేటాయించామని చెప్పారు. వీరిలో గుంటూరు. విజయవాడ, ఏలూరు ప్రాంతాలకు చెందిన 583 మంది విద్యార్థినులకు రూ.48.60 లక్షలను అందించామని వివరించారు. మలబార్ గ్రూప్ చైర్మన్ ఎంపీ అహమ్మద్ మాట్లాడుతూ మనిషి ఎదుగుదలకు విద్య శక్తివంతమైనదని, విద్యార్థులు జీవితాలను మార్చడమే మలబార్ గ్రూప్ లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో 'తూర్పు' ఎమ్మెల్యే గద్దె రామమోహన్‌రావు, మలబార్ గోల్డ్ సిబ్బంది పాల్గొన్నారు.



స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్న మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యే గద్దె

క్షయ వ్యాధి ప్రాణాంతకం కాదు

వించిపేట(విజయవాడపశ్చిమ): క్షయ వ్యాధి ప్రాణాంతక వ్యాధి కాదని నియంత్రణ మన చేతుల్లోనే ఉందని, అది వ్యాప్తి చెందకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కొత్తపేటలోని షేక్ రాజా సాహెబ్ (ప్రసూతి) మినీ జనరల్ హాస్పటల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శాంతి కిరణ్ పేర్కొన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా షేక్ రాజాసాహెబ్ ఆసుపత్రి వద్ద డాక్టర్ శాంతి కిరణ్ పర్యవేక్షణలో సోమవారం క్షయ వ్యాధి నియంత్రణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా క్షయ వ్యాధిగ్రస్తులకు మందులతో పాటు వారి పోషకాహారం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రతినెలా రోగుల బ్యాంకు ఖాతాల్లో వెయ్యి రూపాయలు జమ చేస్తుందని తెలిపారు. అనంతరం క్షయ వాధ్యి నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ సాయిరామ్, డాక్టర్ వాణిశ్రీ, డాక్టర్ గౌస్ భాషా, డాక్టర్ స్రవంతి, పీజీ డాక్టర్లు, కొత్తపేట యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పద్మ నాగేంద్రరావు, లలిత కుమారి, రమీజా పాల్గొన్నారు.

